క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో ఏఎస్పీ



స్వామిని దర్శించుకున్న ఏఎస్పీ

కాణిపాకం: కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి వారిని శుక్రవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ రాజశేఖర్ రాజు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు అందించి స్వామి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ధరణీధర తదితరులున్నారు.

విచ్చలవిడిగా పోస్టర్లు, బ్యానర్లు పెట్టొద్దు



థియేటర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు: నగరంలో ఇష్టారాజ్యంగా సినిమా పోస్టర్లు, బ్యానర్లు పెట్టరాదని నగర కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో సినిమా థియేటర్ల యజమానులు, ప్రతినిధులకు సమావేశం నిర్వహించి కమిషనర్ మాట్లాడారు. నగరంలో ఎక్కడబడితే అక్కడ ఇష్టానుసారంగా సినిమా పోస్టర్లు అతికించడం, బ్యానర్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు అసౌకర్యం కలగడంతో పాటు, స్వచ్ఛత ప్రక్రియకు ఇబ్బందిగా మారిందని ఒకింత అసహనం వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఏఈ కార్యాలయాలను పరిశీలించిన ఎస్ఈ



కొంగారెడ్డిపల్లె ఏఈ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ, ఈఈ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని మిట్టూరు, కొంగారెడ్డిపల్లె సబ్‌స్టేషన్, ఏఈ కార్యాలయాలను ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ శుక్రవారం పరిశీలించారు. ఏఈ, సిబ్బందితో మాట్లాడారు. సబ్‌స్టేషన్‌లోని ఫీడర్ వారీగా ఎన్ని సర్వీసులకు సరఫరా ఇస్తున్నారు? ఒకవేళ సరఫరాలో అంతరాయం కలిగితే ప్రత్యామ్నాయంగా ఏ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా తీసుకుంటున్నారో తెలుసుకున్నారు. నగరంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్లతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఉర్జావీర్ పథకం కింద 5 స్టార్ రేటింగ్ కల విద్యుత్ పరికరాలను కొనుగోలు చేయిస్తే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ విధానంపై వారికి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, డీఈ ప్రసాద్, ఏఈలు రాజేంద్రబాబు, వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపార్ అవస్థలు

ఒకే దేశం–ఒకే స్టూడెంట్ కార్డు నినాదంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానంలో భాగంగా తీసుకొచ్చిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) విద్యార్థులను అవస్థలకు గురి చేస్తోంది. అపార్ కార్డు కోసం ఏమి చేయాలి? ఎలా నమోదు చేసుకోవాలి? అనే అంశాలపై గందరగోళం నెలకొంది. స్పష్టమైన విధానం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో జెరాక్సు, ఇంటర్‌నెట్ సెంటర్లు, ఆధార్ కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గంటల తరబడీ పడిగాపులు కాయాల్సి వస్తోంది.

- ఆధార్ వివరాలు ప్రామాణికంగా రూపకల్పన
- విద్యార్థుల వివరాల్లో తప్పులు
- అప్‌డేట్‌కు బర్త్ సర్టిఫికెట్ అడుగుతున్న ఆధార్ కేంద్రాల నిర్వాహకులు
- మార్పుల కోసం పరుగులు

బంగారుపాళెం: మండలంలో 97 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల, 8 ప్రైవేటు పాఠశాలలు, రెండు ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 9,696 మంది విద్యార్థులు చదువుతున్నారు. దేశంలో పౌరుల గుర్తింపునకు ఆధార్ కార్డు ఉన్నట్టే.. విద్యార్థులకు అపార్ కార్డు తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆధార్ కార్డులోని వివరాలను ప్రామాణికంగా తీసుకుని విద్యార్థులకు అపార్ కార్డు రూపొందిస్తున్నారు. అయితే ఇక్కడే అసలు సమస్య తలెత్తుతోంది. ఆధార్ కార్డులో తప్పుల తడకగా నమోదైన వివరాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. చాలా మంది పుట్టిన వివరాలు, ఆధార్ కార్డులో ఉన్న వివరాలకు పొంతన ఉండడం లేదు. విద్యార్థి వివరాలను పాఠశాలలోని అడ్మిషన్ రిజిస్టర్‌తో పాటు యూడైస్‌లో పొందుపరచారు. అపార్ నమోదు సమయంలో ఆధార్ కార్డు వినియోగించడంతో అందులోని పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు తదితర వివరాలు అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్‌లతో పోలిస్తే వేర్వేరుగా ఉంటున్నాయి.



బంగారుపాళెంలో మీ-సేవా కేంద్రం వద్ద వివరాలు సరిదిద్దుకునేందుకు నిరీక్షిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

దీంతో ఆధార్ నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.

అడ్డంకిగా ఆధార్ సమస్యలు

ఆధార్ కార్డులో ఉన్న సమస్యలు అపార్ కార్డు రూపకల్పనకు అడ్డంకిగా మారాయి. గత నెల 22 నుంచి 25 వరకు ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కేంద్రాల్లో కేవలం ఫోన్ నంబర్ అప్‌డేట్ వంటి చిన్న చిన్న సమస్యలను మాత్రమే దిద్దుబాటు చేశారు. తండ్రి పేరు, డేట్ ఆఫ్ బర్త్ వివరాల్లో తప్పులుంటే సరిచేసేందుకు జనన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి రావడంతో విద్యార్థులకు అవస్థలు ఎదురవుతున్నాయి. ఇప్పటికిప్పుడు బర్త్ సర్టిఫికెట్ పొందే అవకాశం లేదు. ప్రభుత్వ ఆసుపత్రులలో జన్మించిన వారికి బర్త్ సర్టిఫికెట్ ఆసుపత్రులలోనే జారీ చేస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల వద్ద పుట్టిన వారికి బర్త్ సర్టిఫికెట్ తల నొప్పిగా మారుతోంది. ఈ నేపథ్యంలో అపార్‌లో నమోదు చేసే ముందు ఆధార్ కార్డు, స్కూల్ అడ్మిషన్ రిజిస్టర్లలో వివరాలు ఒకేలాగా ఉన్నాయో లేదో సరిచూసుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. బర్త్ సర్టిఫికెట్ అవసరమైన వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అపార్ కార్డు పొందితే..

కేంద్రం సూచించిన విధంగా కేజీ నుంచి పీజీ వరకు చదువుకునే ప్రతి విద్యార్థికి గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నారు. అపార్‌పై క్యూఆర్ కోడ్‌తో పాటు 12 అంకెల గుర్తింపు సంఖ్య ఉంటుంది. ఒక విద్యార్థికి కేటాయించిన గుర్తింపు సంఖ్య మరొకరికి ఉండదు. ఆధార్ కార్డు తరహాలోనే ఒకే సంఖ్య ఉంటుంది. కార్డు పొందిన విద్యార్థి ఎక్కడి నుంచైనా పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు పొందే వెసులుబాటు కలుగుతుంది. ఈ క్రమంలో అపార్ నమోదు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. తొలి దశగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు అపార్ కార్డులు జారీ చేసేందుకు కేంద్ర విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. అపార్‌కు ఆధార్, బ్యాంక్ అకౌంట్, పాన్‌కార్డులు అన్నీ లింక్ అయి ఉంటాయి. అపార్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేది, జెండర్, ఫోటో, క్యూఆర్ కోడ్, 12 అంకెల గుర్తింపు సంఖ్య ఉంటాయి. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే విద్యార్థికి సంబంధించిన ఈ వివరాలతో పాటు మార్కులు, గ్రేడ్లు, ఉపకార వేతన వివరాలు, అవార్డులు, డిగ్రీలు, క్రీడలు, ఇతర అంశాల్లో సాధించిన విజయాలతో పాటు విద్యా సంబంధిత వివరాలతో సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు.. వివరాలన్నీ తెలుసుకునేలా అపార్ కార్డు రూపుదిద్దుకుంటోంది.



అపార్ కార్డు

సకాలంలో అపార్ నమోదు కృషి



అపార్‌కు విద్యార్థుల వివరాలు సక్రమంగా నమోదు చేయించి సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. అపార్ నమోదులో తలెత్తుతున్న కొన్ని సాంకేతిక సమస్యలను సరిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు 80 శాతం వివరాలు పూర్తి చేశాం. కొంతమంది విద్యార్థుల వివరాలు సక్రమంగా లేని కారణంగా వాటిని సరి చేయించే ప్రక్రియ సాగుతోంది. మండలంలోని కొని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో అపార్ నమోదు 50 శాతం జరగాల్సి ఉంది.

–నాగేశ్వర్‌రావు, ఎంఈఓ, బంగారుపాళెం

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి



గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన

చిత్తూరు కార్పొరేషన్: గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని విజయం స్కూల్ కరస్పాండెంట్ శైలజ కోరారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించి ఆమె మాట్లాడారు. పోటీ పరీక్షలకు సిద్ధపడేవారు గ్రంథాలయాల్లో ఇంటర్‌నెట్, పలు రకాల పోటీ పరీక్షల పుస్తకాలను సద్వినియోగం చేసుకుంటే తమ లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. పుస్తక పఠనంతో మానసికోల్లాసం, మేధా వికాసం కలుగుతుందని తపోవనం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గజలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత లైబ్రేరియన్ విజయ్‌కుమార్ 40 రకాల పుస్తకాలను వితరణ చేశారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శర్మ, డిప్యూటీ గ్రంథాలయాధికారి లలిత, సహాయ గ్రంథాలయాధికారి గజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ అభిమానుల అన్నదానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో శుక్రవారం కృష్ణ అభిమాన సంఘ అధ్యక్షుడు కేపీ శ్రీధర్ ఆధ్వర్యంలో సినీ నటుడు కృష్ణ వర్ధంతి నిర్వహించారు. అనంతరం 35వ వార్డులోని వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అభిమానులు రవికుమార్, రాజేంద్ర, బాబు, మోహన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు అనుమతివ్వాలి

– డీఆర్‌ఓకు డీహెచ్‌పీఎస్ నాయకుల వినతి



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని బైరెడ్డిపల్లె మండలం దాసర్లపల్లెలో ప్రభుత్వ భూమిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు కలెక్టర్ అనుమతి ఇవ్వాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు కోరారు. ఈ మేరకు ఆ సమితి నాయకులు శుక్రవారం డీఆర్‌ఓ మోహన్‌కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, దాసర్లపల్లెలో అంబేడ్కర్ విగ్రహం ప్రతిష్టాపనను తహసీల్దార్ అడ్డుకోవడం తగదన్నారు. దాసర్లపల్లె దళితులకు సంబంధించిన భూములను ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయం, రైతుభరోసా, గ్రామ పంచాయతీ, తాగునీటి ట్యాంకులు నిర్మించుకునేందుకు ఇచ్చారన్నారు. పాఠశాల భవనానికి, రాములు గుడి కొండపైన మహాద్వారానికి సైతం దారి కల్పించి సహకరించారన్నారు. అలాంటి దళితులకు ప్రస్తుతం అంబేడ్కర్ విగ్రహం ప్రతిష్ఠించేందుకు అనుమతి ఇవ్వకపోవడం అన్యాయమని నిరసించారు. కలెక్టర్ జోక్యం చేసుకుని అనుమతి ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దామోదరం, నాయకులు దాసరి చంద్ర, రఘు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా నూతన కౌన్సిల్ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ విద్యార్థి నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కౌన్సిల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి తెలిపారు. శుక్రవారం స్థానిక మిట్టూరులోని ఆర్‌కే డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన కౌన్సిల్ అధ్యక్షుడిగా బాలాజీ నాయక్, ఉపాధ్యక్షులుగా సంజయ్, సోము, యామిని, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా షారుఖ్, బాలాజీ, సాయి కుమార్, కిషన్, కోశాధికారిగా మన్సూర్, గౌరవ అధ్యక్షులుగా మున్నాను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ, ఎన్నికైన కౌన్సిల్ సభ్యులు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేయాలన్నారు. నూతన ఎన్నికైన కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ, చిత్తూరులో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నగరి, పుంగనూరు, పలమనేరు, చిత్తూరు నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎల్ఐసీ కళాజాత



పలమనేరు: ప్రజాధనం ప్రజా ప్రయోజనాల కోసమేనంటూ స్థానిక ఎల్ఐసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కళాజాత ప్రజలను ఆకర్షించింది. బెంగళూరులో ఈనెల 16 నుంచి 19 దాకా సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ యూనియన్ 13వ మహాసభల నిర్వహిస్తున్న నేపథ్యంలో కళాజాత బృందం రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా కార్యక్రమాలను నిర్వహిస్తూ శుక్రవారం ఇక్కడ ప్రదర్శన ఇచ్చింది. ఎల్ఐసీ సేవలు, ప్రయోజనాలు, ఆశయాలను పాటలు, నృత్యాల రూపంలో వివరించింది.

బోయకొండ చైర్మన్ పదవి బలిజలకు ఇవ్వాలి

పుంగనూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన చౌడేపల్లె మండలంలోని శ్రీబోయకొండ గంగమ్మ ఆలయ చైర్మన్ పదవిని బలిజ కులస్తులకు కేటాయించాలని ఆర్‌పీఎఫ్ జాతీయ అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రాయల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నాయకులు హేమంత్ కుమార్, నానబాలకుమార్, శ్రీకాంత్, జనార్థన్‌తో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా బలిజ కులస్తులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్‌తో సీఎంకు వినతిపత్రం పంపుతున్నట్లు తెలిపారు. బోయకొండ చైర్మన్ పదవిని సీనియర్ టీడీపీ నాయకుడు, న్యాయవాది, యాదవ సామాజిక వర్గానికి చెందిన బి.వెంకటముని యాదవ్‌కు ఇవ్వాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిర్ణయించినట్లు తెలిసింది.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ





తవణంపల్లె: మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ జుబేదా, ఐరాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

తవణంపల్లె: పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ జుబేదా కోరారు. శుక్రవారం తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. డిప్యూటీ సీఈఓ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, సాంకేతిక నిపుణులు, గ్రామస్తుల సమన్వయంతో అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ రెడ్డిబాబు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులను సమకూర్చుకునేలా ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ప్రణాళికను ఈ–గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ధనలక్ష్మి సూచించారు. పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ఆర్థిక ప్రణాళికలో పొందుపరచాలన్నారు. ఈఓపీఆర్‌డీ కుసుమకుమారి మాట్లాడుతూ సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రణాళిక ఉండాలని కోరారు.



బంగారుపాళెం: మాట్లాడుతున్న అధికారులు

బంగారుపాళెం: ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ, మండల అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ, పీపీడీపీ)పై ఎంపీపీ అమరావతి అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీధర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం, ఎన్ఆర్‌ఈజీఎస్, ఇతర శాఖలకు వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలపై గ్రామస్తులతో చర్చించి, ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఆ నిధులు వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. పంచాయతీలో ఆర్థిక వనరులను గుర్తించి, వాటిని సమకూర్చుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరారు.

ఎటుచూసినా కార్తీక శోభ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ప్రధాన అర్చకుడు గంగాధరగురుకుల్ ఆధ్వర్యంలో అర్చకులు దండపాణి గురుకుల్, సోమశేఖర్ గురుకుల్, మంజునాథ గురుకుల్ అభిషేకం జరిపించారు. మహిళలు ఆలయం ఎదుట కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవరకొండ జలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పూజలు చేశారు. పార్వతీదేవి సమేత జలకంఠేశ్వరస్వామికి అభిషేకం చేపట్టారు.

మొగిలీశ్వరునికి అన్నాభిషేకం

శ్రీమొగిలీశ్వర స్వామి వారికి ఘనంగా అన్నాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని సేవించుకున్నారు. తంబుగానిపల్లెకు చెందిన లోకనాథనాయుడు, ప్రమీలమ్మ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. నగరంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, కుళందీశ్వర స్వామి ఆలయం, చిదంబేశ్వరస్వామి ఆలయం, నాగేశ్వరస్వామి ఆలయాల్లో మహిళలు నేతిదీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.



భక్తులతో కిటకిటలాడుతున్న చిదంబరేశ్వరస్వామి ఆలయం

అర్ధగిరి క్షేత్రంలో 'పౌర్ణమి' వేడుకలు

తవణంపల్లె: మండలంలోని అర్ధగిరి క్షేత్రంలో ఉన్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం గంధం, సుగంధ పుష్పాలు, తమలపాకులతో ప్రత్యేక అలంకరణ చేశారు. ధూపదీప నైవేద్యం సమర్పించారు. ఈ క్రమంలోనే సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి వైభవంగా ప్రాకారోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు.



బంగారుపాళెం: స్వామివారికి అన్నాభిషేకం



బంగారుపాళెం: భక్తులకు అన్నదానం







తవణంపల్లె: పుష్కరిణి వద్ద స్వామిని సేవించుకుంటున్న భక్తులు, చిదంబరేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు, తవణంపల్లె: హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టండి

- పార్టీ శ్రేణులకు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పిలుపు
- పలువురు నాయకుల ఇళ్లకు వెళ్లి పరామర్శ



పలమనేరులో మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ వైఎస్సార్‌సీపీ నాయకుల బైక్ ర్యాలీ

పలమనేరు: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికాయి. పలమనేరు డీఎస్పీ కార్యాలయానికి పుంగనూరు కేసుల విషయంగా ఆయన విచ్చేశారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో నాయకులు, వైఎస్సార్ సోషల్ మీడియా నిర్వాహకులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆపై అక్కడి నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు భారీ మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఎంసీ మాజీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి గృహానికి వెళ్లి మాట్లాడారు. ఆపై పట్టణానికి చెందిన పలువురు నేతలతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, ఎంపీపీ రెడ్డెప్ప, మురళీకృష్ణ, మండీ సుధా, జాఫర్, చెంగారెడ్డి, గణేష్ యాదవ్, మాజీ ఎంపీపీలు రాజేంద్రన్, ఆర్ శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ విభాగాల నేతలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్



తవణంపల్లె: గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

ఐరాల: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని సవటపల్లె, మల్లారపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో సుమారు 120 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతోనే పోషక విలువలు లభించే ఆహార పదార్థాలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

జి.గొల్లపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'

తవణంపల్లె: మండలంలోని జి.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యుడు మోహన్‌వేలు మాట్లాడుతూ వర్షాకాలంలో జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా తెరలు వాడాలని, వేపాకు పొగ వేయడం మంచిదని సూచించారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించిన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.